

కథా కౌముది

# గొలుసు

భరద్వాజ్ గొడవర్తి

అంతం సినిమాలోని 'సిరివెన్నెల' గారు రాసిన పాట, మీ కోసం.

చెక్, చెక్

"తనువు మనసూ చెరిసగమని పంచాలి అనిపించునో,

సరిగా అదే శుభముహూర్తం సంపూర్ణమయ్యేందుకు,

మనమే మరో కొత్త జన్మం పొందేటి బంధాలకు..."

"బలే పాడుతున్నాడు కదండీ!"

"అతను చాలా పెద్ద సింగర్ అంటండీ. అదేదో పేరు గుర్తురావట్లేదు కానీ, యూట్యూబ్ ఛానల్ కూడా ఏదో ఉన్నట్టుంది."

"అవునా! రోజుకు ఎంత తీసుకుంటాడేంటి?"

"ఎంతో కరెక్ట్‌గా తెలీదు కానీ, బాగా తీసుకున్నాడని మాత్రం విన్నాను."

"ఇంతకీ ఖర్చులు మగ పెళ్లి వారివా, ఆడ పెళ్లి వారివా?"

ఇది ఆ పెళ్లి మండపంలో కూర్చున్న ఇద్దరి సంభాషణ. ఇంకా ఎవ్వరెవ్వరు ఏం మాట్లాడుకుంటున్నారో చూద్దాం పదండి.

"అయినా 'చెరిసగం' అని పంచితే, సంపూర్ణం ఎలా అవుతుందిరా సారధి? శాస్త్రి గారు ఎందుకు అలా రాశారు అంటావు?"

"పంచినా సగం అవ్వని బంధం కాబోలు ఛటర్జీ!"

"పంచినా సగమవకుండా, సంపూర్ణంగానే ఉంటూ, ఇద్దరూ తమ స్వేచ్ఛని, అభిప్రాయాలని, అభిరుచుల్ని కోల్పోకుండా, compromise అవ్వకుండా, ఒకే చోట, ఒకే ఇంట్లో ఉండడం సాధ్యపడుతుంది అంటావా?"

"అర్థం చేసుకుంటూ, అర్థం అవుతూ జీవిస్తే సాధ్యమవుతుంది ఏమో!"

"నీకు మీ అబ్బాయి ఇంట్లో కూర్చోబెట్టి సినిమాలు బాగా చూపిస్తున్నట్టున్నాడు. సరే, వీళ్ల గురించి వదిలెయ్, మా చెల్లితో నీ దాంపత్యం ఎలా ఉందో చెప్పు."

"ఛటర్జీ, భోజనాలు అయిపోవచ్చాయి. ఇప్పుడైనా కదులుదామా?"

భజంత్రీలు, భజంత్రీలు...

"మాంగల్యం తంతునానేనా మమజీవన హేతునా!
కంఠే భద్నామి సుభగే త్వం జీవ శరదాం శతం."

మాంగల్యధారణ జరుగుతోంది, ఆ సమయంలో వధువు తన మేడలో పడుతున్న ఆ మంగళసూత్రం వైపే తదేకంగా చూస్తోంది.

నెమ్మదిగా తన చెంపల మీదకి రెండు నీటి బిందువులు వచ్చి ఆగాయి.

ఈలోగా ఆ పెళ్లికొడుకు తన అర్థాంగి నుదిటిపై ప్రేమతో ముద్దు పెట్టాడు.

అక్కడే ఉన్న కొంతమంది ఫోటోగ్రాఫర్లు ఆ సన్నివేశాన్ని బంధించడానికి ఎగబడుతున్నారు, వాళ్లు తమకి అడ్డుగా వస్తున్నారని కసురుకుంటూ, లేచి నిలబడి చూస్తున్న ఇద్దరు అతిథులు మాట్లాడుకుంటున్నారు.

"పెట్టేసాడా ముద్దు?"

"తన పెళ్ళానికి తను ముద్దు పెట్టుకున్నాడు. అందులో తప్పేంటి?"

"ఆ ముద్దు నాలుగు గోడల మధ్య పెట్టుకుంటే తప్పులేదండి!"

"మనకెందుకండి? పెళ్లికొచ్చామా, భోజనం చేశామా, ఆశీర్వదించామా, వెళ్ళామా, అని ఉండక!"

"అయినా కాలం మారింది. మనం కూడా కొన్ని చూసీ చూడనట్లు వదిలేయాలి."

"కాలం మారింది నిజమే, తరాలు మారాయి నిజమే, మనుషులు మారారు నిజమే, కానీ భారతీయ సాంప్రదాయం మారలేదు కదా? మంగళసూత్రం కడుతున్నప్పుడు చదివే మంత్రోచ్చారణ మారలేదు కదా?"

"అయినా ఆ ముద్దు పెట్టింది అమ్మాయి మీద ప్రేమతో కాదండి. వాళ్ల ప్రేమ ఆ పెళ్లి ఆల్బం మీద. అవి సోషల్ మీడియాలో పెడితే వచ్చే కామెంట్లు, లైకులు మీద!"

అక్షింతలు వేయడానికి తమ వంతు వచ్చింది. అక్షింతలు వేస్తూ ఆ పెళ్లి కొడుకుతో అన్నాడు.

"Happy married life, బాబు! నేను మీ నాన్నగారి ఆఫీసులో గుమస్తానండి. మీకు ఆ అమ్మాయి మీద ఎంత ప్రేమ లేకపోతే అలా ముద్దు పెడతారు? నాకు బాగా నచ్చింది, అండి! మేడం గారు, మీరు చాలా లక్కీ అండోయ్!"

అని, అంత హడావిడిలోనూ వాళ్లకి నాలుగు మాటలు చెప్పేసి, ఒక ఫోటో దిగేసి, చెప్పులు వేసుకుని వెళ్లిపోయారు.

మండపం మీద మంగళసూత్ర ధారణ ముగిశాక, ఆ మంగళసూత్రం కడుతున్నప్పుడు తాను ఉచ్చరించిన మంత్రం గురించి వివరించాలని ప్రయత్నిస్తూ పంతులుగారు ఆ వధూవరుల వైపే తదేకంగా చూస్తున్నారు.

ఈలోగా ఫోటోగ్రాఫర్లు,

"మేడం, ఇటు చూడండి! సర్, ఇటు చూడండి!

మేడం, ఒకసారి ఆ తాళిని ముద్దుపెట్టుకోండి... అలానే ఉండండి... స్లోగా తల పైకి ఎత్తండి...

ఇప్పుడు సార్ వైపు నవ్వుతూ చూడండి...

సార్, మీరు కూడా నవ్వండి...

మేడం, మీరు ఎమోషనల్ అవ్వండి!"

ఇదంతా గమనిస్తున్న పంతులుగారికి అర్థమైంది, ఆ మంత్రం తాలూకు అర్థం వాళ్లకు అవసరం లేదని. వాళ్లకు ప్రస్తుతం అవసరమైనది ఒక మంచి చిత్రం!

చిత్రంగా?!

శ్రీమయి మెడలోని మంగళసూత్రం సరి చేసుకుంటూ——

"సీత, అసలు తాళి మగవాడి మెడలో ఎందుకు కట్టకూడదు?

మెట్టెలు మగవాడు ఎందుకు పెట్టుకోకూడదు?

మనకి మాత్రమే ఎందుకు ఈ అలంకారాలు?

మగవాళ్లకు ఎందుకు ఆ స్వేచ్ఛ?

ఏం సీత, ఈ రోజుల్లో ఆడ, మగ, సామానమే కదా!

మరి ఎందుకు ఈ అసమానత్వం?”

సీత నవ్వి, “అవ్వనీ నాకు తెలియవు కానీ, శ్రీమయి! ఇంతకీ పిల్లలు ఏం చేస్తున్నారు? ఇంట్లో ఒక్కడే ఉండగలరా?”

“ఒక్కడే ఉండడం వాళ్లకి అలవాటే, సీత! ఇద్దరూ కాలేజీ నుంచి కలిసే వస్తారు. పెద్దదానికి తనకు తోచిన వంట చేసేస్తోంది.”

“మరి చిన్నోడు?”

“చిన్నోడు వాడు ఆడే ఆటలకు, ఇంటికి వచ్చేసరికి వేలాడిపోతాడు. స్టవ్ వెలిగించడం కూడా రాదు. పెద్దదానికి కొంచెం ఓపిక ఎక్కువే. తను చూసుకుంటుంది.”

సీత నవ్వుతూ, “అయితే నీ విలువలు మీ ఇంటి వంటింటికి వర్తించవన్న మాట?”

“అదేంలేదే సీత, చిన్నోడు కదా వాడు! పైగా అంత సమయం వాడికి ఉండదు. ఇంటికి రాగానే ఏదోకటి చదువుకుంటూ ఉంటాడు!”

“మరి ఆ చదువు పెద్దదానికి ఉండదా?”

అలా ఏదో చెప్పబోతుంటే, సీత వారిస్తూ,

“అవన్నీ వదిలేయ్, శ్రీమయి! ఇది చెప్పు, రేపు పొద్దున్న మీ అబ్బాయికి పెళ్లి చేస్తే, తాళి మీ వాడు కట్టుకుంటాడా? లేక ఆ అమ్మాయి కట్టుకుంటుందా?”

“మా వాడు ఎందుకు కట్టుకుంటాడు?”

“మరి అబ్బాయి ఎందుకు కట్టుకోకూడదని ప్రశ్నించావు?”

“నేను అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని ప్రశ్నిస్తున్నాను! సమాజంలోని మేల్ డామినేషన్ గురించి మాట్లాడుతున్నాను!”

“మీ అబ్బాయి కూడా ఆ డామినేషన్‌లో భాగం అవుతాడే కదా? ఈ రోజు కాకపోవచ్చు, రేపు అవుతాడు కదా?”

“అయినా మా అబ్బాయి సమయానికి అసలు పెళ్లి చేసుకుంటాడో లేదో? ఒకవేళ వాడు చేసుకున్నా, రిజిస్టర్ మ్యారేజ్ చేయిస్తాను!"

"ఒకవేళ అతనికి కూడా ఇలా సాంప్రదాయపరంగా చేసుకోవాలనిపిస్తే?”

“అప్పుడు చూద్దాం లే!”

సీత కొంచెం గంభీరంగా, “చూడు, శ్రీమయి! సిద్ధాంతానికి ఒకటే ఊపిరి ఉండాలి. అంతేకానీ, అనేక ఊపిరులు కాదు!”

నెమ్మదిగా పెళ్లికి వచ్చిన అతిథుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. మండపం పైన కన్యాదానం కార్యక్రమం నడుస్తోంది.

“కట్నం ఎంత తీసుకున్నారట?”

“కట్నం ఏమి తీసుకోలేదంట! కానీ ఆ అమ్మాయి పేరు మీద ఇల్లు రాయించుకున్నారంట!”

“అది కూడా కట్నమే కదా?”

“అది కట్నం ఎలా అవుతుంది? అమ్మాయి పేరు మీద అన్నీ రాయించుకుంటే? అమ్మాయికే కదా మొత్తం వచ్చేది?”

“ప్రేమతో అడగకుండా ఇచ్చేది కట్నం అవదు. అదే అడిగి ఇస్తే అది కట్నమే కదా? అయినా, మీ అమ్మాయికి కట్నం ఇవ్వలేదు కదా, సరస్వతి గారు? మరి మీ అబ్బాయికి ఏం చేస్తారు?”

“అమ్మాయికి అంటే వాళ్లు ఇద్దరూ ఇష్టపడి చేసుకున్నారు. అందుకనే అడగలేదు, ఇవ్వలేదు. అబ్బాయికి వేరు కదండీ! పై చదువులు చదివించాం, ఇల్లు కొన్నాడు, బోలెడు ఖర్చులు ఉంటాయి. అయినా మేము అడిగి తీసుకోలేదు. మీరు ఏమైనా పెడితే, మీ అమ్మాయికే పెట్టమన్నాం!”

“సరే, ఒకవేళ వాళ్లు వాళ్ల అమ్మాయికి ఏమి ఇవ్వకపోతే? అప్పుడు మీకు సమ్మతమేనా?”

“ఖాళీ చేతులతో వచ్చే లక్ష్మీదేవి, మీకు సమ్మతమేనా?”

పెళ్లి ముగిసిపోయింది, అందరూ వెళ్లిపోయారు, వారితో వాళ్ల అభిప్రాయాలు వెళ్లిపోయాయి.

మండపం, కొన్ని షామియానా కుర్చీలు, ఇరు కుటుంబ సభ్యులలోని ముఖ్యమైన వ్యక్తులు, వధూవరులు మాత్రం మిగిలిపోయారు.

మరునాడు సత్యనారాయణ స్వామి వ్రతం, పెళ్లి జరిపించిన పంతులుగారే వ్రతం కూడా జరిపించాల్సి ఉంది.

ఆయన ఉదయం వ్రత సమయానికన్నా ముందుగానే అక్కడికి వచ్చారు, వ్రతానికి కావాల్సిన సరంజామా సర్దుకుంటున్నారు.

అప్పుడే పెళ్లి కూతురు తన గదిలోనుంచి కిందకి దిగి వస్తోంది,

మెడలో తాళిబొట్టు లేదు,

పసుపు కొమ్ములు మెడలో లేవు కానీ, పసుపుపచ్చ రంగు చీర కట్టుకుంది.

దిగి వస్తూ, మండపంపై కూర్చున్న పంతులుగారిని పలకరించింది,

ఆయన కూడా పలకరించారు,

ఆ అమ్మాయి వెనకే నడుస్తూ వస్తున్న వాళ్ల అమ్మగారు, పంతులుగారిని చూసి, “కాఫీ తాగారా?” అని అడిగారు.

పెళ్లి కూతురు, వాళ్ల అమ్మగారు ఇద్దరూ కింద నిలబడి, మండపంపై కూర్చున్న పంతులుగారితో మాట్లాడుతున్నారు.

అలా మాట్లాడుతూనే ఆ తల్లి, ఏదో గుర్తొచ్చినట్లుగా, తన కూతురితో—

“ఇదిగో, చేయిపట్టు! నీ గొలుసు మరిచిపోయావ్!” అని మంగళసూత్రం చేతిలో పెట్టారు!

మంగళసూత్రం గొలుసుగా మారిన ముహూర్తాన, సత్యనారాయణ స్వామి వ్రతం మొదలైంది.

“ఓం గురుభ్యో నమః” అని పలికి, పంతులుగారు ఒక నిమిషం అలా ఆగిపోయారు.

ఆ దేవుడి పటాలలో ఆయన ప్రతిబింబాన్ని కుటుంబ సభ్యులు చూస్తున్నారు.

వ్రతం మొదలుపెట్టే ముందు, “మీకు ఒక విషయం చెప్పాలనిపించింది, అండీ!” అంటూ విరామం తీసుకున్నారు.

”మాంగల్యం తంతునానేనా మమజీవన హేతునా!
కంఠే భధ్నామి సుభగే త్వం జీవ శరదాం శతం”
“అంటే అర్థం తెలుసా మీకు?”

పంతులుగారు అలా అడగగానే, అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

పంతులుగారు వధువు మెడలోని మంగళసూత్రం వైపే తదేకంగా చూస్తూ, ఇలా అన్నారు,

★★“పెళ్లి అనేది చాలా పవిత్రమైనది నా వరకు.

మీ నమ్మకం, ఆ ఎదురు నిలబడి ఫొటోగ్రాఫర్లు బంధిస్తున్న చిత్రంలో మాత్రమే ఉంటే, ఈ మంత్రం తాలూకు అర్థంతో మీకు పని లేదు. అది దాటి ఏదైనా నమ్మకం మీకు కలిగిన రోజున, నా ఇంటికి ఒక పూట భోజనానికి రండి."

పక్కనే ఉన్న వాళ్ల అమ్మగారి వైపు చూస్తూ,

"అమ్మా, అది గొలుసు కాదు. వీరు ఇద్దరూ జీవితకాలం ప్రయాణించాల్సిన బంధానికి సంకేతం!"

అని చెప్పి, అందరి వైపు చూసి, మళ్లీ వ్రత క్రియలోకి వెళ్లిపోయారు.

ఆ జంట ఆయన ఇంటికి ఈ రోజు దాకా భోజనానికి వెళ్లలేదు.

నెమ్మదిగా, కాల ప్రవాహంలో, ఆ జంట విడిపోయారు.

"కారణాలు బలమైనవే అంట" అని ఆ పెళ్లికి వచ్చిన ఓ వ్యక్తి అన్నాడు.

"కారణాలదేముందండి, అయినా కారణాలు ఎప్పుడూ బలమైనవి కావు, బలమైనవి ఎప్పుడు కారణాలుగా మిగిలిపోవు." అని మరో వ్యక్తి సమాధానమిచ్చాడు.

ఈ విషయం, వేరే పెళ్లి జరిపించడానికి వెళ్లినప్పుడు, ఆ పంతులుగారికి తెలిసింది.

అప్పుడు ఆయనకు, వాళ్ల వివాహ వేడుకలో, ఫొటోగ్రాఫర్లు తనను చెప్పనిచ్చిన అర్థం గుర్తొచ్చింది.

జీలకర్ర—బెల్లం శుభముహూర్తాన, ఆ అర్థాన్ని వధూవరులకు వివరిస్తూ,

"తల మీద మీరు చేయి పెట్టే చోటుని 'బ్రహ్మ రంధ్రం' అంటారు.

ఆ బ్రహ్మ రంధ్రం మీద జీలకర్ర—బెల్లం ఉంచి, మీరు ప్రమాణం చేస్తున్నారు, ఏటువంటి పరిస్థితుల్లోనూ మేము విడిపోమని!"

ఆ వివరణ ఆయనకి గుర్తొచ్చింది.

మౌనంగా ఇంకో కార్యక్రమం కూడా జరిపించేసారు.

ఈసారి అర్థాలు చెప్పలేదు.

సంభావన పుచ్చుకొని, ఆటో ఎక్కి ఇంటికి పయనమయ్యారు.

ఆటోలో, మనసులో అనుకున్నారు, “మళ్లీ ఎప్పుడు పెళ్లిని, కార్యక్రమంగా కాకుండా, వేడుకగా చేస్తానో?”

ఆ ఆటోలో ఏదో పాట మోగుతోంది.

ఆ పాట వేగం ఆయనను ఆకర్షించలేదు కానీ, సాహిత్యం ఆకర్షించింది.

అందులోని పదాలు,

"వసంతపు నవ్వులు,
వాడిపోని పువ్వులు,
నీకై నే మళ్ళీ మళ్ళీ పుట్టేద నీ విరి చూపుకై,
ధీమ్ ధీమ్ తనన ధీమ్ తననన,
ఓ అంబరం అనంతం,
ధీమ్ ధీమ్ తనన ధీమ్ తననన,
ఓ ప్రేమే దిగంతం!"

“మనుషులు సముద్రంలోని అలలు...
బంధాలు ఆ అలల సమూహాలు...
ఎన్ని సమూహాలు జంటగా తీరం చేరుతాయో...
ఎన్ని జీవనం అనే అనంత జలనిధిలో కలిసిపోతాయో...”

★★★

COMMENTS